


— కుచ్చర్లపాటి ప్రజ్ఞలత

ఆ రోజు వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. సాయం సంధ్య. చల్లని చిరుగాలి, ప్రకృతి అంతా హృదయాన్ని గిలిగింతలు పెట్టే ముగ్ధ మనోహరంగా వుంది. ఒకొక్కసారి వాతావరణాన్ని బట్టే మన మనోభావాలు కూడ ఉత్తేజిత మవుతాయి. ఆ చల్లని సాయం సంధ్యవేళ అంతకన్నా మనోహరమైన, మనసును ఆనంద తీరాల్లోకి లాగే, ఒక కమనీయ కావ్యం నా చేతుల్లో వుంది. పసిపాప నవ్వులా, సెలయేటి గలగలలా మనసును పరవశింపచేసే శక్తి ఇంక దేనికివుంది ? "గీతాంజలి" ఎన్నిసార్లు చదివినా తనివితీరని మహాద్భుత కావ్యం.

మానవుని అంతరాంతరాలలో నిగూఢంగా వున్న వేదన అంతా, గీతాంజలిలోని మనోహరమైన భావాల తాకిడికి కరిగి ప్రవహించి, మంచి గంధపు సువాసనలా, మనసంతా ఆక్రమించి క్రమంగా ఒక విధమైన ఉత్తేజంతో పిల్లగాలిలా మనసును సేద తీర్చగలిగే అద్భుతమైన శక్తి గీతాంజలి.

"నీ మృదుల కరాల స్పర్శ సోకితే చాలు. నా చిన్నారి గుండెలో ఆనందం పరుగులు తీస్తుంది. ఏవో మాటలు నాలో పెల్లుబుకుతాయి."

"నా బ్రతుకులోని అపస్వరాలన్నీ కరిగి ఒక కమ్మని మధురశ్రుతిలో లీనమైనాయి."

"నా లోని పూజాభావం హాయిగా ఏ చీకూ చింతా లేకుండా సాగరంపై ఎగురుతూ వెళ్ళే పక్షిలాగా రెక్కలు చాచింది."

ఇలా ఎన్నని ఉదహరించను ? గీతాంజలిలోని భావుకతల కుసుమాంజలివి.

గీతాంజలి పూర్తిచేసి, ఇంకా ఆ రసాస్వాదనలోని ఆనందాన్ని కళ్ళు మూసుకుని అనుభవిస్తున్న నేను, బయట ఏదో గొడవగా వినపడటంతో కళ్ళు తెరచి, వాస్తవంలోకి వచ్చి బయటకు నడిచాను.

గేటు దగ్గర నౌకరు గంగన్న ఎవరినో గదమాయిస్తున్నాడు.

"గంగన్నా !" పిలిచాను.

"వస్తున్నానమ్మా" అంటూ, "వెళ్ళు వెళ్ళు ఇంక నిలబడకు" అంటూ వచ్చాడు.

"ఏమిటి గొడవ ? ఎవరిని వెళ్ళమంటున్నావు. అతనెవరు ?" ప్రశ్నించాను.

"ఆ ! ఎవడోనమ్మా అయ్యగారికోసం వచ్చాడు. లేరు అని చెప్తితే వినడు. జిడ్డులాగ పట్టుకుని అమ్మగారినయినా కలుసుకుని నా కష్టం చెప్పుకుంటాను అంటాడు."

"అతన్ని ఇలా రమ్మను" అన్నాను.


ఆ మాట వినడంతోనే అతను ముఖం విప్పారగా గబగబా వచ్చి "దండాలమ్మా" అన్నాడు.

"ఎవరు నువ్వు ? ఏం కావాలి" అన్నాను అతన్ని పరిశీలనగా చూస్తూ.

పల్లెటూరి వాడిలా వున్నాడు. మనిషి దేని గురించో ఆందోళన చెందుతున్న వాడిలా కంగారుగా వున్నాడు. నేను అడగ్గానే కళ్ళల్లో నీరు తిరుగుతుండగా, చెప్పసాగాడు.

"అమ్మా ! ఈడకు 5 మైళ్ళ దూరంలో వున్న పల్లెమాది. ఈడ సర్కస్సు ఆడతా వుంది. సర్కస్సు చూపియ్యమని మా బొట్టెడు పాణాలు తీత్తావుంటే ఇయ్యాళ తీరిక చేసుకుని బయలెల్లాము. అదేం ఖర్మో ఈడకు రాగానే ఆడికి సుస్తీ చేసినాది. మనిషి పూరికే మెలితిరిగి పోతండు. విపరీతంగా పూష్ణం వచ్చేసినది. నేను లబోదిబో మంటుంటే చూసి వాళ్ల ధర్మాసుపత్రి చానా దూరంలో వుంది. ఈడకు దగ్గర్లో ప్రవేటు ఆస్పత్రివుంది.

**ఈ రోజుల్లో ఇలాంటి కధలల్లి పొట్టపోసుకునే మోసగాళ్ళు ఎక్కువ అవడంతో, ఎవరు మంచో, ఎవరు చెడ్డో అంచనా వేయలేకపోతున్నాము. నిజమగునో కాదో-మోసపోతానేమో-అనే అనుమానం రావడం సహజం. కాని నాకెందుకో అతను అబద్ధం చెప్తున్నాడనిపించలేదు.**



అక్కడకు తీసుకు పొమ్మన్నారు. ఏకాఏకిని మా బొొట్టెడ్ని ఆస్పత్రాలికి తీసుకుపోయి డాక్టరు బాబు కాళ్ళముందు పడేసాను. కాని ఆ డాక్టరు బాబు కాసింతన్నా కనికారం నేకుండా ముందు ఫీజు 20 రూ. అక్కడెడితేనేగాని చూడను పొమ్మన్నాడు"

"నా కాడ చూత్తే 5 రూ॥ వున్నాయి. డాక్టరుబాబు కాళ్ళా ఏళ్ళా పడ్డాను. పని జరిగి పోయినాక నీవు ఆ పల్లెటూరి నుండి వచ్చి డబ్బిత్తావా ? ముందు డబ్బు పట్టుకురా. కుర్రాడిని ఇక్కడ వదిలి అన్నాడు. చేసేదేంలేక మా వూరోళ్ళెవరేనా కాపాడతారేమో అని చూసాను. పార్వతీదేవి శాపం ఇచ్చినట్టు ఒక్కడూ కనపడనేదు. కనపడిన ఇంటికెళ్ళి ఇద్దరు ముగ్గురిని అడిగేను. అందరూ ఈకట కథ ఇక్కడ కాదు. ఇంకెక్కడన్నా చె అన్నారు. ఆడ నుండి వత్తుండగా ఈ మే డ అగుపడినాది. ఈడన్నా ధర్మాత్ములు వుండక పోతారా అని ఇలా వచ్చాను తల్లీ"

"నా కథంతా ఓపిగ్గా ఇన్నావు. నీవు సాయం చేయకపోతే నాబొొట్టెడు నాకుదక్కడు. తల్లి పోయిన కాడ్నుంచి తల్లి తండ్రి నేనే అయి ఆడ్ని సాకుతూ వచ్చాను. నా చర్మం వలిచి నీకు చెప్పులు కుట్టిత్తానమ్మా. బొొట్టెడ్ని కాపాడు తల్లీ" అంటూ కళ్ళవెంట నీరు కారుతుండగా చేతులు జోడించి అడిగాడు.

ఈ రోజుల్లో ఇలాంటి కధలల్లి పొట్టపోసుకునే మోసగాళ్ళు ఎక్కువ అవడంతో, ఎవడు మంచో, ఎవరు చెడ్డో అంచనా వేయలేకపోతు న్నాము. నిజమగునో కాదో. మోసపోతామేమో అనే అనుమానం రావడం సహజం. కాని నాకెందుకో అతను అబద్ధం చెప్తున్నాడనిపించ లేదు. మోసం, దగా అతని ముఖంలో నాకు కనపడలేదు.

నాకు అతనిపట్ల కలిగిన నమ్మకమే అతనికి నా చేత 20 రూ॥ నోటు ఇచ్చేలా చేసింది.

డబ్బు ఇస్తూ. "వెంటనే వెళ్ళి ఈ డబ్బు ఆ డాక్టరు ముఖాన కొట్టి నీ కుర్రాడిని రక్షించుకో" అన్నాను.

డబ్బు అందుకుంటూ, అతను చూచిన చూపులో, ఎంతో ఆనందం, మరెంతో కృతజ్ఞతా భావం కనిపించాయి

"నూరేళ్ళు చల్లగా పిల్లాపాపలతో బ్రతుకు తల్లీ! తప్పకుండా నీ ఋణం తీర్చుకుంటానమ్మా" అంటూ వెళ్ళిపోయాడు.

అంతవరకు ఇదంతా చూస్తూ, నిలుచున్న గంగన్న "అమ్మగారూ అదంతా నిజమని నమ్మేరా? మనం ఎన్ని వినటంలేదు మోసపోయినవారి కథలు" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్నవాడల్లా నేను సీరియస్‌గా చూసేసరికి ఆగిపోయాడు.

నేను మౌనంగా లోపలకు నడిచాను.

* * *

సాయంకాలం జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తూ, శ్రీవారి రాకకోసం ఎదురుచూస్తూ పోరికోలో నిలబడ్డాను. అప్పుడు సమయం 9 గంటలు అయింది.

ఇంతలో కారు హారన్ విని గంగన్న వెళ్ళి గేటు తెరిచాడు. కారు లోపలకు వచ్చింది. కారు దిగిన శ్రీవారితో కలసి లోపలకు నడిచాను.

పావుగంట తరువాత ఇద్దరము డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాము. ఇందాకటి సంఘటన గురించి చెప్పాలని నాకు ఒకటే ఆత్రంగా వుంది. శ్రీవారు భోజనం చేస్తూ, నేను పడే ఆరాటం గమనించినట్టున్నారు.

"ఏమిటి విశేషం విన్నీ" అన్నారు.

శ్రీవారు కూడ అదంతా అబద్ధం అంటారేమో అని ఒక ప్రక్క భయపడుతూనే, జరిగిన విషయం చెప్పాను.

"ఏమండీ! డాక్టర్లు ఫీజు తీసుకోవాలి కాదనను. కాని అంత కర్కశంగా ప్రాణాలతో చెలగాట మాడడం, మానవత్వం అనిపించుకోదు. వున్నవాళ్ళ దగ్గర ఖచ్చితంగా వసూలు చేయవచ్చు. కాని పేదవారిని కొంచెం దయగా చూడకపోతే వాళ్ళేమయిపోతారు? ఇందాకటి విషయమే తీసుకుంటే ఎవరూ నమ్మి అతనికి డబ్బు ఇవ్వలేదు. నేను కూడ ఇచ్చి వుండకపోతే, ఒక డాక్టరు డబ్బు దాహానికి, ఒక పసివాడు నిష్కారణంగా బలైపోయేవాడు. అది నిజమే అని నీవు అంతగా గ్యారంటీగా ఎలా చెప్పగలవు?" అని మీరు అడగొచ్చు"

"కాని నా మనసు చెప్పిన విధంగా నేను నడచుకున్నాను అతను చెప్పింది నిజమని నా మనసు కనిపించింది. ఒకవేళ అది అబద్ధమయినా పెద్దగా బాధపడను. సమయానికి డబ్బు అంది ఆ కుర్రాడు బ్రతుకుతాడనే వూహలోనే ఆనందం పొందుతాను."

"మీరు కూడ డాక్టరు కదా? మీరు మాత్రం ఆ డాక్టర్‌లా ఎప్పుడూ ప్రవర్తించరు కదూ! పేదవారిని అవసర సమయాల్లో ఆదుకుంటారు కదూ" అని అంటూన్న నేను, శ్రీవారి వాలకం గమనించి తెల్లబోయాను. చేతిలో ముద్ద అలా పట్టుకునే కుర్చీలో వెనక్కి ఆనుకుని, నాకేసి పిచ్చిగా చూస్తున్నారు.

"ఏమండీ? ఏమిటలా వున్నారు ఏమయింది" అన్నాను ఆత్రుతగా ఆయనను కుదుపుతూ.

తేరుకున్న శ్రీవారు కంచంలో చేయి కడుక్కొని వెళ్ళబోతూ, ఆగి ఒక్కక్షణం నా ముఖం వంక చూచి, జేబులోంచి 20 రూ. నోటు తీసి, "ఇదిగో నీ డబ్బు, అయామ్ సో సారీ విన్నీ" అంటూ టేబిల్‌మీద పెట్టి తల వంచుకుని గదిలోకి వెళ్ళిపోయారు.

అంటే?

ఆ కర్కోటకుడు అనుకున్న డాక్టరు శ్రీవారా? ఓ మైగాడ్ అనుకుంటూ, నా నమ్మకం నిజమయినందుకు సంతోషించాలో, శ్రీవారిమీద ఇన్నాళ్ళూవున్న నమ్మకం తుడిచిపెట్టుకుపోతున్నందుకు ఏడవాలో అర్థంకాక, నా దగ్గర నుండి ఒకరి ప్రాణం కాపాడటానికి వెళ్ళిన ఆ 20 రూ॥ నోటు, శ్రీవారి కసాయితనానికి సాక్షీభూతంలా తన విలువ మార్చుకుని, రూపాంతరం చెంది టేబులుమీద గాలికి రెపరెపలాడుతుంటే, పిచ్చిగా దానివంకే చూస్తుండిపోయాను. *



నావే!

గుర్రప్పందాలు జోరుగా జరుగుతున్నాయి. ఒకాయన వరసగా నాల్గయిదుసార్లు ఒకే గుర్రంమీద పందెం కట్టాడు అది ప్రతిసారీ ఓడిపోతూనే వుంది. అది చూసి ప్రక్క ఆసామి "మీరు అనవసరంగా ఈ గుర్రం మీద పందెం కడుతున్నారు కాని ఇది గెలవదు" అన్నాడు

"మీకెలా తెలుసు" అని అడిగేడు అతను "ఆ గుర్రం యజమానిని నేనే" అన్నాడా ఆసామీ

"అయినా పర్వాలేదు. నేను ఈ గుర్రం మీదే పందెం కడతాను ఎందుకంటే మిగిలిన నాలుగు గుర్రాలూ నావే" అసలు విషయం చెప్పేశాడు అతను

-చందు భావనారాయణ (గోదావరిఖని)

పాఠకులకు, ఏజెంట్లకు

## ఒక ముఖ్య గమనిక

డక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రిక ఆంధ్రభూమి దినపత్రిక, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక డక్కన్ క్రానికల్ సంస్థ నుంచి వెలువడుతున్న పత్రికలు కొన్ని ఇతర పత్రికలు కూడా మాసంస్థ నుంచే వెలువడుతున్నట్లు పాఠకులు, ఏజంట్లు అభిప్రాయపడుతున్నారని మాకు తెలుస్తోంది. మా ఈ సంస్థకు గాని వాటిలో పనిచేస్తున్న సిబ్బందికిగాని వేరే ఏ పత్రికతోను సంబంధాలు లేవని గమనించాలని కోరుతున్నాము

జనరల్ మేనేజర్
డక్కన్ క్రానికల్